www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 28 డిసెంబర్ 2024
5
వైఎస్ఆర్

పేదలకు భూములు పంచాలి : వ్య.కా.స

ప్రజాశక్తి-ఒంటిమిట్ట : కొత్త మాధవరం, ముకుంద ఆశ్రమం, మల్లేశ్వరపురం గ్రామాలలో నిరుపేద సాగులో ఉన్న వారందరికీ భూ పంపిణీ అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు కోనేటి నరసయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంటిమిట్టలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 ఏళ్ల నుంచి భూ పంపిణీకి పేదలకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో పరిధిలో ప్రభుత్వ భూములు రాజకీయ పలుకుబడి కలిగిన చేతుల్లో ఉన్నాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. జౌకులపల్లె, పెన్నపేరూరులో ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాము, లక్ష్మీనారాయణ, హరి, వెంకటేష్, సాంబయ్య, అమ్ములమ్మ, పార్వతమ్మ, లక్ష్మీదేవి, కావతి పాల్గొన్నారు.

గాలివీడు ఎంపిడిఒపై వైసిపి నేత దాడి

- పోలీసుల అదుపులో సుదర్శన్‌రెడ్డి
- అనుచరుల కోసం గాలింపు చర్యలు

మీడియాతో మాట్లాడుతున్న దాడికిగురైన ఎంపిడిఒ జవహర్‌బాబు

ప్రజాశక్తి-గాలివీడు

అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబుపై వైసిపి లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, అతని అనుచరులు దాడి చేశారు. గాలివీడు ఎంపిపి పద్మావతమ్మ కుమారుడు సుదర్శన్‌రెడ్డి 20 మంది అనుచరులతో కలిసి శుక్రవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఎంపిపి ఛాంబర్ తాళం ఇవ్వాలని అడిగారు. ఎంపిపికి మాత్రమే ఛాంబర్ తాళాలు ఇస్తామని ఎంపిడిఒ స్పష్టం చేశారు. మాకే ఎదురు చెబుతావా అంటూ జవహర్‌బాబుపై సుదర్శన్‌రెడ్డి, అతని అనుచరులు ఒక్కసారిగా దాడికి దిగారు. కుర్చీలో నుంచి కిందపడిపోయినా ఆగకుండా కర్రతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దారు. అనుహ్య పరిణామంతో తిరుగుబాటు చెల్లిపోయారు. తీవ్రంగా గాయపడిన ఎంపిడిఒ జవహర్‌బాబును పోలీసులు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సిఐ కొండారెడ్డి గాలివీడు ఎస్ఐ రామకృష్ణ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని సుదర్శన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని ఎస్‌పి కార్యాలయానికి తరలించారు. దాడిలో పాల్గొన్న అతని అనుచరుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎంపిడిఒపై దాడి విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకుని దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఎంపిడిఒ జవహర్‌బాబు లిఖితపూర్వంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైసిపి నేతల నుంచి ప్రాణహాని : ఎంపిడిఒ

తనపై దాడి జరిగిన తీరును ఎంపిడిఒ జవహర్‌బాబు మీడియాకు వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. గది తాళాలు ఇవ్వనందుకు వైసిపి నాయకుడు సుదర్శన్‌రెడ్డి, ఆయన 20 మంది అనుచరులు నన్ను విచక్షణారహితంగా కొట్టారని తెలిపారు. అడ్డొచ్చిన నా మేనల్లుడిని కూడా కొట్టారన్నారు. దాడి తర్వాత అరగంట పాటు కార్యాలయంలోనే ఉన్నారని చెప్పారు. రాత్రిలోగా నన్ను చంపేస్తామని సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారని వాపోయారు. అతను చాలా సందర్భాల్లో అనుచరులతో వచ్చి ఎంపిపి గదిలో మద్యం సేవించేవారని, ఉదయం గది తాళాలు ఇవ్వలేదని ముఖ్యమైన దాడి చేశారని పేర్కొన్నారు. వైసిపి నేతల నుంచి నాకు ప్రాణహాని ఉందని, ప్రభుత్వం నాకు రక్షణ కల్పించాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలి : సిపిఎం

రాయచోటి టౌన్ : గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని సిపిఎం అన్నమయ్య జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. జవహర్ బాబు విధినిర్వహణలో ఉండగా ఆఫీస్‌కు తాళాలు వేయడమే కాకుండా దాడి చేసి గాయపరచడం అత్యంత హేయమైన చర్య అన్నారు. అధికారుల పనులు నచ్చకపోయినా, ఇబ్బందులు ఉన్నా పైఅధికారులకు ఫిర్యాదు చేయవచ్చిన, దాడులు చేయడం సిగ్గు చేటన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులపై దాడులు మరింత పెరిగాయని రక్షణ కల్పించడంలో వైసిపికి కూటమి ప్రభుత్వాలకు పెద్ద తేడా లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎంపిడిఒపై దాడిచేసిన సుదర్శన్‌రెడ్డిని తీసుకెళుతున్న పోలీసులు

దళిత అధికారిపై దాడి చేయడం హేయమైన చర్య

రామాపురం: గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబుపై వైసిపి నాయకులు దాడి చేయడం చాలా హేయమైన చర్య అని అన్నమయ్య జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకటరమణ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటుతున్నా నేటికీ ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన చేశారు. దళిత ఉద్యోగులపై దాడులు చేయడం తగదన్నారు. చాలా బాధాకరమని తెలిపారు. ఈ దాడిని నిరసనగా కలెక్టర్ కార్యాలయం వద్ద అన్ని మండలాల్లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు నిరసనను తెలపాలని కోరారు.

అధికారిపై దాడి గర్హనీయం

కడప అర్బన్ : విధులు నిర్వహిస్తున్న జవహర్‌బాబుపై వైసిపి నాయకుడు సుదర్శన్‌రెడ్డి, అనుచరులు భౌతిక దాడులకు పాల్పడడం గర్హనీయమని ఏపి పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మల్లేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో దాడిని ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : మంత్రి

రాయచోటి : విధి నిర్వహణలో ఉన్న గాలివీడు ఎంపిడిఒపై వైసిపి నాయకులు దాడి చేయడం మంచిది కాదని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నచిన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోకుండా ప్రభుత్వ అధికారులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. గతంలో ప్రభుత్వ అధికారులపై దాడులు చేయడం వల్ల అధికారు, ప్రజలు వైసిపికి మంచి గుణపాఠం చెప్పారన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, తన పార్టీకి జరిగిన ఘోర పరాజయాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులపై దాడులను పూర్తిగా మానుకోవాలన్నారు. ఎంపిడిఒపై దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఎస్‌పికి సూచించారు.

విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

- నిరసనలో వైసిపి నాయకుల డిమాండ్

కడప నగరంలో భారీ ర్యాలీ నిర్వహించిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - కడప

ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని, ట్రూ ఆఫ్ ఛార్జీలను ఎత్తివేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే ఆ హామీలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలపై రూ.15,486 కోట్ల అదనపు భారాన్ని మోపి ప్రజలను నయవంచన చేశారని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, కడప నగర మేయర్ సురేష్ బాబు ధ్వజమెత్తారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైసిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీల బాదుడుపై శుక్రవారం కడప నగరంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి జిల్లా కార్యాలయం నుండి విద్యుత్ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ ఎస్ఇ ఎస్.రమణకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ టిటిడి బోర్డు మెంబర్లు మాసీమ బాబు, యానాదయ్య, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సీనియర్ నాయకులు సుభాన్‌బాష, నాయకులు, నాయకులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్:** పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కోరారు. వైసిపి నిర్వహించిన ర్యాలీలో ఎంపీ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తానని చెప్పి 7 నెలల్లో ప్రజలపై రూ.15 వేల కోట్లు భారం మోపారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు కిషోర్, భార్గవి పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు విద్యుత్ కార్యాలయంలో ఎడి కిరణ్‌కుమార్‌కు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి బాలయ్య, వైసిపి నాయకులు జయరామిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సాంబశివారెడ్డి, మాడిశెట్టి శివ పాల్గొన్నారు. **చాపాడు (మైదుకూరు) :** విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి నంద్యాల రోడ్డులోని విద్యుత్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకొని డిఇ భరణికృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో చాపాడు ఎంపిపి టి.లక్ష్మమయ్య, మఠం ఎంపిపి వీరనారాయణరెడ్డి, దువ్వూరు ఎంపిపి జయచంద్రారెడ్డి, మైదుకూరు వైస్ ఎంపిపి రఘురామిరెడ్డి, వైసిపి నాయకులు ఆర్‌వి సుబ్బారెడ్డి, పివి రాఘవరెడ్డి, శివశంకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షరీఫ్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. అనంతరం సాయిరాం థియేటర్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ర్యాలీలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, చిన్న కొమెర్ల జగదీశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వైసిపి జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు వల్లంబాయి హృషికేశవరెడ్డి, ముల్లా జానీ, నాగేశ్వర్‌రెడ్డి, యోబు, మలికిరెడ్డి హనుమంత్‌రెడ్డి, పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, దన్నవాడ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. **కమలాపురం:** నియోజకవర్గ బాధ్యుడు నరేన్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద దివంగత నేత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఛార్జీలు ఉపసం హరించుకోవాలని విద్యుత్ ఎఇ చాంద్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. **గోపవరం :** ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా బద్వేల్ పట్టణంలో ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయం నుండి విద్యుత్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ ఎడికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ గురుమోహన్ పాల్గొన్నారు.

పిఆర్‌సిని తక్షణం అమలు చేయాలి : యుటిఎఫ్

సమావేశంలో మాట్లాడుతున్న విజయ్ కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే 12వ పిఆర్‌సిని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ళకొకసారి అమలు చేయాల్సిన పేరివిజన్‌ను అమలు చేయడంలో పాలకవర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అమలు చేసిన పిఆర్‌సిలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన వైసిపి ప్రభుత్వం మాట తప్పి ఉన్న జీతాల్లో కోత విధించి ఉద్యోగులను దగా చేసిందని చెప్పారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల్ని చెల్లించకపోగా ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ లాంటి సొమ్ములను ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించుకుందని విమర్శించారు. అందుకు ప్రతిఫలంగానే గత ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలు నెరవేరతాయని, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని భావించి గత ఎన్నికలలో ఉద్యోగ, ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలు దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల సానుకులంగా స్పందించకపోతే పోరుబాట పట్టక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.రూతు ఆరోగ్యమేరి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గోపీనాథ్, ఎ.డి.దేవదత్తం పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు స్థలాలు గుర్తించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

అంగన్వాడీ కేంద్రాలకు స్థలాలను గుర్తించి సొంత భవనాలల్లో నిర్వహించేటట్టుగా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన మహిళా, శిశు సంక్షేమ శాఖ సమీక్ష సమావేశంలో 13 ప్రాజెక్టల పనితీరు గురించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు శాఖ అందించే సేవలు గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. టిహెచ్ఆర్ 100 శాతం లబ్ధిదారుడికి అందేటట్టుగా చూడాలని ఆదేశించారు. సొంత భావనలకు స్థలాన్ని గుర్తించాలని తెలిపారు. త్వరగా స్థలాలను గుర్తించి అంగన్వాడీ సెంటర్లు సొంత భవనాలల్లో నిర్వహించేటట్టుగా చూడాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలో తల్లుల యొక్క కమిటీలను ఏర్పాటు చేసి చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వారికి అప్పగించి ఆ పనిలోను త్వరగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కడ జరుగుతున్నాయి, ఎక్కడ నమోదు అవుతున్నాయి, ఎక్కువ నమోదు అవుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వాటి యొక్క పరిణామాలు గురించి అవగాహన తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఐఎంఎల్ డిపో యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-కడప అర్బన్

ఐఎంఎల్ డిపో కార్మికుల పట్ల గత ప్రభుత్వం వివక్ష చూపిందని ఐఎంఎల్ డిపో యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం కడప ఐఎంఎల్ డిపో 7వ మహాసభ నగరంలోని ఐఎంఎల్ డిపోలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎంఎల్ డిపోలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కార్మికులకు గత ప్రభుత్వం పనితగ్గ కూలి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. ఎన్నిసార్లు అగ్రిమెంటు చేసుకున్న అగ్రిమెంట్ల ప్రకారం గత ప్రభుత్వం యాజమాన్యాలతో మాట్లాడి ఏమాత్రం కూలి రేట్లు పెంచలేదన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైన ఐఎంఎల్ డిపోలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఇప్పుడు ఉన్న ధరలకు అనుగుణంగా కూలీరేట్లు పెంచాలని కోరారు. లేదంటే గత ప్రభుత్వంలో మాదిరి ఆందోళన, పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని చెప్పారు. ఐఎంఎల్ డిపో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని ఐఎంఎల్ డిపోలలో కార్మికులు కుటుంబాలను పోషించాలంటే గత ఐదు సంవత్సరాల కాలంలో నానా ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. పిల్లల చదువులు, వైద్య ఖర్చులకు అప్పుడు వచ్చే కూలి సరిపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులను దృష్టిలో పెట్టుకుని కూలీ రేట్లు పెంచాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలో నూతన కమిటీని 12 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పి.వెంకట సుబ్బయ్య, అధ్యక్షులుగా రఘురామయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆర్.సుబ్బ రాయుడు, కోశాధికారిగా ఎన్.వి.సుబ్బారెడ్డిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎస్.కృష్ణయ్య జి.రెడ్డి ప్రసాద్, కార్యదర్శులు రామ్మోహన్, రాంప్రసాద్, నరేష్, కమిటీ సభ్యులుగా సురేష్, కొండారెడ్డి, మదన్, కళ్యాణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్రారెడ్డి, ఐఎంఎల్ యూనియన్ నాయకులు ఆర్.సుబ్బరాయుడు, రఘురామయ్య, రామ్మోహన్, నరేష్ పాల్గొన్నారు.

ఐఎంఎల్ డిపో నూతన కమిటీతో నాయకులు

30 నుంచి స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉమ్మడి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ ఉద్యోగ నియామకానికి సంబంధించి పిఇటి, పిఎంటి స్క్రీనింగ్ పరీక్షలు జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డిటిసి)లో ఈ నెల 30వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు ఉంటాయని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులకు హాజరవాల్సిన తేదీ, సమయంకు సంబంధించి హాల్ టికెట్‌లను ఆన్‌లైన్‌లో ఉంచామని పేర్కొన్నారు. కేటాయించిన తేదీ, సమయానికి అభ్యర్థులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్ల రెండు సెట్ల జిరాక్స్ కాపీలు అటెస్ట్ చేసినవి తీసుకురావాలని పేర్కొన్నారు. రిక్రూట్ మెంట్ నోటిఫికేషన్ వచ్చిన తర్వాత జారీచేయబడ్డకుల ధ్రువీకరణ పత్రం, క్రీమి లేయర్ ధ్రువీకరణ పత్రం అభ్యర్థులు తమ వెంట తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. 4వ తరగతి నుంచి 10వ తేదీ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. ఒకవేళ అభ్యర్థులు ప్రయివేట్‌గా చదివి ఉంటే నోటిఫికేషన్ తర్వాత జారీ చేయబడ్డ రెసిడెన్స్ సర్టిఫికెట్‌ను తీసుకురావాలని తెలిపారు.

కడప బేసిన్‌పై విస్తృత పరిశోధనలు జరగాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా ఖనిజ సంపదలకు నిలయమని, జిల్లాలో విస్తృత పరిశోధనలు జరగాల్సి ఉందని వైవీయూ విసి ఆచార్య కృష్ణారెడ్డి అన్నారు. పెట్రోలియం జియాలజిస్టుల సంఘం (ఇండియా) వైవీయూ సంయుక్త ఆధ్వర్యంలో 'ఎక్స్ప్లోరింగ్ ద ప్రొటిరోజోయిక్స్ ఆఫ్ సౌత్ ఇండియా - క్లాస్టిక్ అండ్ కార్బొనేట్ రాక్స్ ఆఫ్ కడప బేసిన్' 5 రోజుల వర్క్‌షాప్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ జిల్లాలో కడప అపారమైన ఖనిజ సంపద ఉందని, దానిపై లోతైన పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. దేశంలోని అత్యున్నత పరిశోధన సంస్థల నుంచి సైంటిస్టులు రావడం జిల్లాను అధ్యయనం చేయడం మంచి పరిణామన్నారు. కడప బేసిన్ లో హైడ్రో కార్బన్ల అన్వేషణ జరగాల్సి ఉందన్నారు. ఇలాంటి వర్క్‌షాపుల ద్వారా పరస్పరమేదో మార్పిడి, పరిశోధన పత్రాల కోసం విద్యావేత్తల భాగస్వామ్యం లభిస్తుందన్నారు. కావేరి ఒఎన్‌జిసి కావేరి బేసిన్ జనరల్ మేనేజర్ డాక్టర్ పి.ఆర్ముగం మాట్లాడుతూ 30 మందితో కూడిన పరిశోధన బృందం సమగ్ర పరిశీలన చేస్తామన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్లు ఆచార్య వంగల సునీత, డాక్టర్ ఎస్.శ్రీనివాస గౌడ్ నేతృత్వంలో ఆయిల్ ఇండియా (ఢిల్లీ) కృష్ణ గోదావరి బేసిన్ (ఆంధ్రప్రదేశ్), అంకాలేశ్వర ఆయిల్ ఫీల్డ్ (గుజరాత్), అస్సాం ఆయిల్ ఫీల్డ్ (దిబ్బోయ్) సంస్థల నుంచి 30 మంది పరిశోధకులు 5 రోజులపాటు జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటన అనంతరం సర్వే నివేదిక(మోనోగ్రామ్) ప్రచురించి భారత ప్రభుత్వానికి అందజేస్తారని విసి వెల్లడించారు.

8, 9న శతాధిక కవి సమ్మేళనం : 'మూల'

ప్రజాశక్తి-కడప అర్బన్ : నగరంలోని ఐఎంఎ హాల్‌లో ఫిబ్రవరి 8, 9వ తేదీల్లో వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం 2వ మహాసభల్లో 'రాయలసీమ, భాష, చరిత్ర, సంస్కృతి, సాహిత్యం' అనే అంశాలపై శతాధిక కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. రాయలసీమ ఔన్నత్యాన్ని చాటి చెబుతూ 20 లైన్లలో కవిత కానీ, తేటగీతి, ఆటవెలది, కంద పద్యాల్లో నాలుగు పద్యాలు గాని, 2 లేక 3 వృత్తి పద్యాలుగాని రాసి జనవరి 15వ తేదీ లోపు 'వైయస్సార్ జిల్లా శతాధిక కవి సమ్మేళనం' అనే వాట్సాప్ గ్రూప్, 9704651414, 9703912727 వాట్సాప్ నంబర్లకు గాని మీ కవిత, పద్యాలు పంపా లని, వాటిలో న్యాయ నిరే?తల ద్వారా మూడు ఉత్తమ కవితల్ని ఎంపిక చేసి ప్రథమ బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, తృతీయ బహుమతి రూ.1000 బహుమతులు అందజే స్తామని చెప్పారు. తర్వాత కవులు పంపిన ప్రతి కవితను మహాసభల్లో ఆ కవి ద్వారా ఆలాపన చేయించి పెద్దల సమక్షంలో శాలువ, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో తగిన రీతిలో సత్కరిస్తామన్నారు. ఈసారి మహా సభల్లో విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు వేమన శతకం, సుమతీ శతకం, బ్రహ్మంగారి కాళికాంబ సప్తశతిలో పద్య పఠన పోటీలు పేర్కొన్నారు. జూనియర్ కళాశాల, డిగ్రీ విద్యార్థులకు కవితల పోటీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వీటిలో కూడా ప్రతి విభాగం లో ప్రథమ బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి రూ.1000 బహుమతులను ఇస్తామని పేర్కొన్నారు. తర్వాత ఏడు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు.

ఉర్దూ మీడియం ఉండేలా చూడాలి : 'అపుటా'

ప్రజాశక్తి-కడప సిటీ: ప్రతి మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే జూనియర్ కళాశాల్లో ఉర్దూ మీడియం ఉండేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (అపుటా) నాయకులు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మండలంలో ఒక జూని యర్ కాలేజ్ స్థాపించేందుకు విద్యా శాఖ మంత్రి లోకేష్ నిర్ణయం తీసు కోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉర్దూ మీడియం కూడా పెట్టాలని, ప్రతి ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఎల్‌కెజి, యుకెజి పిల్లలను చేర్చు కోవడానికి అనుమతించాలని కోరారు. పేద ముస్లిం మైనార్టీల పిల్లలకు మేలవుతుందన్నారు. రాష్ట్రంలో స్కూల్ కాంప్లెక్స్ జరుపేటప్పుడు ఉర్దూ ఉపాధ్యాయులను ఉర్దూ కాంప్లెక్స్‌లోనే కొనసాగించాలని కోరారు. శ్రీనివాసులరెడ్డి స్పందించి ఈ విషయాలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అపుటా కార్యదర్శి హిదయతుల్లాఖాన్, మహబూబ్ ఖాన్, తాజుద్దీన్ బాబా, అబ్దుల్ బసిత్, హాబీబుల్ల పాల్గొన్నారు.

రేపు నెలనెలా సీమ సాహిత్యం

ప్రజాశక్తి-కడప అర్బన్: యోగివేమన విశ్వవిద్యాలయ సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' 139వ సదస్సును ఈనెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 139వ సదస్సులో 'డాక్టర్ మౌని జీవితం-సాహిత్యం' అనే అంశంపై శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిశోధన సంస్థ సహాయాంధ్ర పరిశోధకులు డాక్టర్ తొండాటి రాజశేఖర్ (తిరుపతి) ప్రసంగిస్తారని తెలిపారు.

పరిశ్రమల సందర్శనను ప్రారంభిస్తున్న వైవీయూ విసి కె.కృష్ణారెడ్డి

ప్రత్యక్ష పరిశీలనతో ఆచరణాత్మక జ్ఞానం

- వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రత్యక్ష అనుభవం ద్వారా ఆచరణాత్మక జ్ఞానాన్ని పొందడాని పరిశ్రమల సందర్శన ఉపయుక్తమవుతుందని వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఎంబిఎ విద్యార్థులు 'ఇండస్ట్రియల్ విజిట్' కార్యక్రమాన్ని విసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనేజ్మెంట్ నిర్వహణతో పాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్ ఉన్నవారు దేశ విదేశాల్లో రాణిస్తారని ఆ దిశగా తయారు కావాలన్నారు. పరిశ్రమలను ప్రత్యక్ష పరిశీలన చేయడం ద్వారా వాస్తవ స్థితిగతులు జ్ఞానం వృద్ధి చెందుతుందన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సమగ్ర జ్ఞానాన్ని పొందుతారన్నారు. వైవీయూ స్కూల్ ఆఫ్ కామర్స్ ల్యాండ్ బిజినెస్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమల సందర్శనలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత మాట్లాడుతూ తరగతి గదిలో బోధనకు తోడు పరిశ్రమలను ప్రత్యక్ష పరిశీలన ద్వారా సంపూర్ణ అవగాహన కలుగుతుందన్నారు. పరిశ్రమల్లో ఉత్పత్తి, మార్కెటింగ్, మానవ వనరులు, ఫైనాన్స్, పరిశోధనా అభివృద్ధి, డాక్యుమెంటేషన్ వంటివి విద్యార్థులు నేరుగా తెలుసుకుంటారన్నారు. అనంతరం కొప్పర్తిలోని ట్రయోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్ విద్యార్థులు సందర్శించారు. కార్యక్రమంలో ఎంబిఎ బిఒఎస్ చైర్మన్ డాక్టర్ గంగయ్య, అకడమిక్ కన్సల్టెంట్లు టి.అనిల్ దేవకుమార్, వెంకట రమణయ్య, పి.రాజశేఖర్, పి.సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో అధికారుల నిలదీత

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

స్థానిక శ్రీశక్తి భవనంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులను ప్రజలు నిలదీశారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు సదస్సులు ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సులో ప్రసంగాలు కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సదస్సుకు హాజరై టిడిపి నియోజకవర్గ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం అధికారులకు సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు చొరవచూపాలన్నారు. మాధవరంలో దొంగ పట్టాలు సృష్టించి ఇండ్లను నిర్మించుకుంటున్నారని తహశీల్దార్ దృష్టికి టిడిపి నాయకులు తీసుకొచ్చారు. చాలా మంది రైతులు అధికారులు దృష్టికి తమ భూములను అక్రమంగా ఆన్‌లైన్‌లో గతంలో ఎక్కించుకున్నారని వాటిని సరిచేసి మాకు ఇవ్వవలసిందిగా కోరారు. రెవెన్యూ సదస్సులో ప్రజలు, రైతుల నుంచి వివిధ రకాల సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. అర్జీలు ఇచ్చిన వారికి రసీదులు ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులతో పాటు టిడిపి నాయకులు వెంకట సుబ్బయ్య, రామచంద్రయ్య, కొత్తపల్లి బొబ్బిలిరాయుడు, రమణ, గంగిరెడ్డి, యానాదయ్య, పత్తి సుబ్బరాయుడు కొమర వెంకట నరసయ్య, పామూరు సుబ్రమణ్యం, మామిళ్ళ ఈశ్వరయ్య, రేవెల్ల బాల మునయ్య, మోదుగుల నర్సింహులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

పేదలకు వరం సిఎం సహాయ నిధి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేద ప్రజల ఆరోగ్యం భద్రత సిఎం సహాయ నిధి అని శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో పులివెందుల నియోజకవర్గానికి చెందిన 10మందికి ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వీరికి రూ.24,15,531ల చెక్కులను బాధితులకు అందజేశామన్నారు. అనంతరం లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మోటర్లకు మీటర్లు బిగించే ప్రసక్తే లేదు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యుత్ వ్యవస్థను నాశనం చేసింది గత వైసిపి ప్రభుత్వమేనని, రైతుల మోటర్లకు మీటర్లు బిగించే ప్రసక్తేలేదని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెరగడానికి కారణం ఎవరో ప్రజలకు తెలుసునని, గత ప్రభుత్వ విధానాల వల్ల పెరిగాయని అన్నాడు. ఇప్పుడు ధర్నాలు చేయడం నాటకమన్నారు. 2019-2024 వ్యవధిలో పదిసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచింది జగన్ ప్రభుత్వమే అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఏ ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచబోమని తెలిపారు.

గత ప్రభుత్వ ఒప్పందాల వల్లే విద్యుత్ ఛార్జీల భారం

ప్రజాశక్తి - చాపాడు

గత వైసిపి ప్రభుత్వ ఒప్పందాల వల్లే ప్రస్తుత విద్యుత్ ఛార్జీల భారమని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్‌పై వైసిపి ఆందోళన కార్యక్రమాలను చూస్తుంటే రాష్ట్ర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని పేర్కొన్నారు. జగన్ పరిపాలనలో అవగాహనలేక విద్యుత్ రంగంపై తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం రూ.1:30 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు తగ్గించడానికి సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

1 నుంచి జెవివి ఉచిత బ్యాంక్ కోచింగ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎస్‌బిఐ, ఐబిపియస్, ఆర్‌బిఐ ఉచిత కోచింగ్‌ను జనవరి 1 నుండి అందిస్తున్నామని జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్ట కార్యదర్శి సునీత, మ్యాథ్స్ ప్యాకల్టీ రవిబాబు తెలి పారు. స్థానిక జెవివి కార్యాలయంలో శుక్రవారం కోచింగ్‌కు సంబందించిన పోస్ట ర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోచింగ్ ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1వరకు, మళ్లీ 2 నుండి సాయంత్రం 6 వరకు ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు 97053 33305కు ఫోన్‌చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. జెవివి నాయకులు అఫ్రోజ్, హర్షిత, చంద్రకళ, పవన్, రాకేష్, గురు, హరనాధ్, రాజేశ్వరి, దీపిక, గాయత్రి, శ్యామల పాల్గొన్నారు.

మార్చి నెలాఖరుకు పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు మార్చి నెలాఖరులోపు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డిఇ రమణారెడ్డి సూచించారు. మండలంలోని బి.చెర్లోపల్లిలో శుక్రవారం అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అసంపూర్తిగా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో మాట్లాడుతూ.. సింహాద్రిపురం మండల వ్యాప్తంగా 173 ఇంటి నిర్మాణాలు వివిధ దశలలో అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి నెలలోపు పూర్తి చేసుకోవాలన్నారు. అలా చేయని లబ్ధిదారులకు భవిష్యత్తులో బిల్లులు వచ్చే అవకాశం ఉండదని తెలిపారు. కొత్తగా ఇళ్ల మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆయనతోపాటు సింహాద్రిపురం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ అమర్నాథ్‌రెడ్డి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - చక్రాయపేట

దోమల వృద్ధి నివారణకు, పరిసరాల పరిశుభ్రతకు జాగ్రత్తలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ నాగరాజుల సూచించారు. మండలంలోని చక్రాయపేట, సురభి ప్రాథమిక కేంద్రాలను శుక్రవారం నాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ముఖ్యంగా ఎన్‌సిడి సర్వే, బిఎస్‌ఆర్‌కె కార్యక్రమం పై పరిశీలించారు. సురభి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సురభి దళితవాడ డ్రైడే ఫ్రైడే అవగాహన కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ ఖాజామొద్దీన్, సురభి, చక్రాయపేట వైద్యాధికారులు శివప్రసాద్, వాణి, ఎంపిహెచ్ఒ రామకృష్ణ, సిహెచ్ఒ వెంకట్రామిరెడ్డి, ఎఎంఒ వెంకటరెడ్డి, సబ్ యూనిటీ అధికారి ఎన్‌వి ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ నరేష్, హెల్త్ మేల్ అసిస్టెంట్ వెంగయ్య, ఎఎన్ఎం మహారాజ్, సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రగతి విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ అందజేత

ప్రజాశక్తి - తొండూరు

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మల్లెల శాఖ ప్రగతి విద్యాజ్యోతి స్కాలర్షిప్ స్కీమ్ లో భాగంగా 7, 9 తరగతి చదువుతున్న ప్రతిభవంతుల ఎస్‌సి, ఎస్‌టి బాలికలకు రూ.5000 ప్రకారం ముగ్గురు విద్యార్థులకు అందజేశారు. ఈ విద్యార్థులు మల్లెల హైస్కూల్లో చదువుచున్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నిరంజన్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై పార్లమెంటులో ఆరోపణలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని అంబేద్కర్ సేవా సమితి చైర్మన్ రామాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఆమ్‌ఆద్మీ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిరసన చేశారు. అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో- ఆర్డినేటర్ రహంతుల్లా, సిపిఐ ఏరియా కార్యదర్శి బ్రహ్మం మాట్లాడారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ వేముల మండల కార్యదర్శి ఎస్ చాంద్‌బాషా, అంబేద్కర్ సేవా సమితి వైస్ చైర్మన్ ఇల్లూరు పుల్లయ్య, గొంగడి శేఖర్, టి.స్వామిదాసు, చిట్టి చంద్ర, జోసెఫ్, చెంద్రాయుడు, రఫి పాల్గొన్నారు.

కడప ఉక్కుపై పాలకులు మౌనం వీడాలి

జమ్మలమడుగు రూరల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాప్రతినిధులు మౌనం వీడి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాల జయవర్ధన్, అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి హిమబిందు, సుబ్బమ్మ డిమాండ్ చేశారు. కన్యాతీర్థం వద్దనున్న స్టీల్ ప్లాంట్ శిలాఫలకం వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు అరుణకుమారి, వసంత్, సుందరయ్య, లక్ష్మీనారాయణ, చరణ్, సుధీర్ పాల్గొన్నారు.

దారి కష్టాలు ఎప్పటికి తీరేనో..!

దసరా పాయా.. సంక్రాంతి వచ్చా - కూటమి నేతల మాటలు గాలిలో..

ప్రజాశక్తి - వేంపల్లె

గత ప్రభుత్వ పాలనలో మంజూరై నిలిచి పోయిన రోడ్డు నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో.. కష్టాలు ఎన్నడు తీరునో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు నిలిచిపోవడంతో.. ఆ పనులను దసరా, దీపావళి తర్వాత ప్రారంభిస్తామని కూటమి నేతలు గొప్పలు చెప్పారు. దసరా, దీపావళి పోయి సంక్రాంతి వస్తున్నా ఆ రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాలేదు. పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు, వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు పూర్తయ్యేందుకు కూటమి నేతలు పట్టించుకున్న పాపాన పోలేదు. వేంపల్లెలోని కడప-పులివెందుల-గండి రోడ్డును వెడల్పు చేయడానికి గత వైసిపి ప్రభుత్వంలో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో హడావుడిగా వేంపల్లెలో నాలుగు వరుసల రహదారి, డ్రయినేజీ నిర్మాణ పనులను చేపట్టారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లు రోడ్డు పనులను అర్ధంతరంగా నిలిపేశారు. వేంపల్లె పట్టణంలో రవాణా వేగాన్ని తగ్గించడానికి కడప-పులివెందుల, గండి రోడ్డుకు సంబంధించి రూ.60.05కోట్ల వ్యయంతో 4.2 కిలోమీటర్లు మేరకు సిమెంట్ రోడ్డు పనులు చేసేందుకు గత వైసిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వేంపల్లె పట్టణంలో చేపట్టిన నాలుగు వరుసల సిమెంట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత వైసిపి ప్రభుత్వ పాలనలో రోడ్డు పనులను సిమెంట్ రహదారి 15 మీటర్లుకుగానూ రాకపోకలు సజావుగా సాగడానికి ఒక వైపు 75 మీటర్లు రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. పులివెందుల రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి 4.2 కిలోమీటర్లుకుగానూ దాదాపు ఒక వరుస రహదారిని పులివెందుల ఎన్టీఆర్ సర్కిల్ సమీపం నుంచి శ్రీరామ్ ఫైనాన్స్ వరకు రహదారి నిర్మాణం చేపట్టారు. నిర్మించిన రహదారిలో కూడా అక్కడక్కడ పనులు నిలిపేశారు. మరో వైపు కంకర మాత్రం పరిచి పనులు నిలిపేశారు. దాదాపు 7నెలలు నుంచి రహదారి పనులు జరగక, కంకర పరిచిన దారిలో పిచ్చి మొక్కలు, కంపచెట్లు మొలిచాయి. ఇప్పటి వరకు సుమారు 1.490 మీటర్లు ఒక వైపు రహదారిని నిర్మించారు. ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తి కాక

అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులు

పోవడంతో గుంతల్లో వాహనాలు నడపలేక దుమ్ముధూళితో వేంపల్లె పట్టణవాసులు కాలుష్యం బారిన పడుతున్నారు. శ్వాసకోస సమ స్యలు ఎదరవుతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా నీరు గోతుల్లో నిలిచి వాహనాలు వెళ్లే సమయంలో పాదచారులపై పడుతోంది. వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రధాన రహదారి వేంపల్లె పట్టణంలోని పులి వెందుల నుంచి కడప రోడ్డులో గుంతలు, గోతులాగా ఏర్పడ్డాయి. వాహన దారులు పులి వెందుల, కడప రోడ్డున వెళ్లాలంటే ఇతర వీధి మార్గంలో ఉన్న మంచి రోడ్డును వెతుక్కుంటూ పోవాల్సివస్తోంది. కడప-పులివెందుల రోడ్డులో 40 శాతం పనులు జరగ్గా, గండి రోడ్డులో 20 శాతం పనులు కూడా జరగలేదు. కడప-పులివెందుల రోడ్డు మార్గంలో రోడ్డు పనులు చేసేందుకు రూ.47 కోట్లు మంజూరు కాగా, గండి మార్గంలో రోడ్డు పనులు చేసేందుకు రూ.13.05 కోట్లు ఎండిఆర్, ఎస్‌హెచ్ కింద నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్‌కు కూటమి ప్రభుత్వం రూ.7కోట్లు నిధులు కూడా మంజూరు చేసింది. పనులు జరగక పోవడంతో ఆ దారిలో చిన్నవాహనాలు ప్రమా దాలకు గురవుతున్నాయి. కూటమి నేతలు సంక్రాంతి పండుగ తర్వాతనైనా మాట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం

- మండల సమావేశంలో ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గత ప్రభుత్వ హయాంలో పైపుల కోసం డిడిలు చెల్లించిన రైతుల వివరాలను వ్యవసాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని ఎఒ శివమోహన్‌రెడ్డి తెలిపారు. సింహాద్రిపురం ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి అరుణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'లో శుక్రవారం వెలువడిన 'డిడిలు చెల్లించిరనా అందని పైపులు' అనే కథనానికి ఎఒ స్పందించారు. మండల వ్యాప్తంగా 204 మంది రైతులు రాయితీ పివిసి పైపుల కోసం డిడి తీసిన విషయం వాస్తవమేనని అన్నారు. ఈ పైపుల కోసం అనేకమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఎఒ వివరించారు. ఎంపిడిఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ కింద మినీ గోకులాలు, సిమెంట్ రోడ్లు పనులు చేపట్టామన్నారు. గ్రామాల్లో మురుగునీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధి కారులు, ప్రజా ప్రతినిధులు సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్దామని కోరారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ శ్రీనివాస్‌రెడ్డి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు వాసుదేవరెడ్డి,

ప్రజాప్రతినిధులు రాక ఖాళీగా ఉన్న కుర్చీలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమూర్తి

శశివర్ణ, ఎపిఒ భారతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో కనిపించని ప్రజా ప్రతినిధులు..

మండల సర్వసభ్య సమావేశానికి ఎక్కువ మంది ప్రజా ప్రతినిధులు హాజరుకాలేదు. వైసిపి మద్దతుదారులైన చాలామంది సర్పంచులు సమావేశానికి గైర్హాజరయ్యారు. జడ్‌పిటిసితోపాటు కొందరు ఎంపిటిసిలు రాకపోవడంతో సమావేశం చప్పగా సాగింది.

మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు

మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - కడప

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఓ గొప్ప నాయకున్ని కోల్పోయిందని, ఆయన మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్, కడప అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ బండి జకరయ్య అన్నారు. శుక్రవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ సంతాప సభ నిర్వహించారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, గౌస్‌పీర్ పాల్గొన్నారు. వైసిపి జిల్లా కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్ బాబు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** ఆదర్శమూర్తి, దేశం గర్వించదగ్గ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపట్ల విచారం వ్యక్తం చేస్తూ యోగి వేమన విశ్వవిద్యాలయం ఘన నివాళులర్పించింది. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పరిపాలన భవనంలో విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య ఎజి దాము, ఎకనామిక్స్ ప్రొఫెసర్ అనిత, ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ సరిత, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, స్కాలర్లు పాల్గొన్నారు. **వేంపల్లె :** భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రపంచ చరిత్రలోనే విశిష్టమైన, విలక్షణమైన నాయకుడని మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి కొనియాడారు. శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులతో కలిసి తులసిరెడ్డి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జానకిరాం, రామకృష్ణ, ఉత్తన్న, ఆరు సేర్ల సుబ్బరాయుడు, వేమయ్య, నాగరాజు, మాష్, వెంకటేష్, రమణ, వినయ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు. **చాపాడు:** మౌనముని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం భారతదేశంలోని అన్ని వర్గాల ప్రజలకు తీరనిలోటని మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ చాపాటి రామసుధాకర్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి శుక్రవారం ఆయన సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రామసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విదేశీ మారక ద్రవ్య నిధులు అడుగంటిపోయిన తరుణంలో 1991 నుండి 96 వరకు ఆయన ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టడం, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడంతో దేశ భవిష్యత్తు పురోగమనం వైపు వెళ్లిందన్నారు. **ఖాజీపేట :** భారత మాజీ ప్రధాని, దేశ ఆర్థిక సంస్కరణల రూపకర్త మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎంపిటిసి సభ్యులు డాక్టర్ ఫయాజ్, కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ మాజీ చైర్మన్ గున్నం పాటి వెంకటరమణ, పార్టీ నాయకులు షేక్ హాజీగౌస్, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల టిడిపి నాయకులు సందుల నాగశివారెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టెం శ్రీరాముల యాదవ్, మైదుకూరు నియోజకవర్గ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్ విచార వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. వైసిపి రాష్ట్ర నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, వైసిపిమండల పార్టీ అధ్యక్షులు దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, నాయకులు పివి రాఘవరెడ్డి మన్మోహన్‌కు ఘన నివాళులర్పించారు. **ప్రొద్దుటూరు :** మాజీప్రధాని మన్మోహన్ సింగ్ మరణం బాధాకరమని కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ విచారం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, అవిశ్రాంత యోధుడు, భారత దేశ ఆర్థికశిల్పి మరణం దేశానికి తీరని లోటన్నారు. రెండు పర్యాయాలు దేశ ప్రధానిగా, అంతకుముందు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రిగా మన దేశానికి సింగ్ అందించిన సేవలు మరపురానివన్నారు. సమావేశంలో మాజీ పట్టణ అధ్యక్షుడు జీలాని బాషా పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటి అధ్యాపకులు షబానాబికి డాక్టరేట్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎస్‌ఆర్‌ఐటి ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ డిపార్ట్మెంట్ అధ్యాపకురాలు పి.షబానాబికి డాక్టరేట్ లభించిందని ప్రిన్సిపల్ డాక్టర్ పాండు రంగన్ రవి తెలిపారు. 'ఇన్ఫ్లుయెన్స్ ఆఫ్ పర్సెప్షన్ అండ్ ఎక్సపెక్టేషన్ ఆన్ డెసిషన్ మేకింగ్ టువార్డ్స్ సెలెక్షన్ ఆఫ్ ఎంప్లాయర్ బ్రాండింగ్ విత్ రిఫరెన్స్ టు ద ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పిం చారన్నారు. చెన్నైకి చెందిన వెల్ టెక్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాడెంట్ వీరకల్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ హెచ్ఒడిలు, అభినందించారు.

4 నుంచి సిపిఎం జిల్లా మహాసభలు

జమ్మలమడుగు రూరల్ : సిపిఎం జిల్లా 12వ మహాసభలు జనవరి 4,5 తేదీల్లో కడప నగరంలో జరగనున్నాయని, వీటిని జయప్రదం చేయాలని మైలవరం మండల నాయకులు కొండయ్య, దాసు, సంజీవ రాయుడు, దాసు, గొరిగె కృష్ణ, నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో మైలవరంలో మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4న కడప జియోన్ కాలేజీ నుండి ఐటిఐ సర్కిల్ వరకు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించి, బహిరంగ సభ ఉంటుందన్నారు. అజ్మత్ కల్యాణ మండపంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నుకోబడిన ప్రతినిధులతో సభ నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

పెండ్లూరులో రెవెన్యూ సదస్సు

వేముల : మండల కేంద్రంలోని పెండ్లూరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. రీ సర్వే, ఒన్ బి ఆడంగల్ రావడం లేదని తహశీలార్ దృష్టికి తెచ్చారు. తమ సమస్యలను రైతులు అధికారులకు వివరించారు. ఇందుకు తహశీల్దారు ఇందిరారాణి స్పందిస్తూ 41 రోజుల తర్వాత ఫిర్యాదు చేసిన సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. రైతులు కూడా సహకరించాలని సూచించారు. ఆర్ఐ ప్రసన్న, మండల సర్వేయర్, రెవెన్యూ అధికారులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE IIIrd ADDITIONAL JUNIOR CIVIL JUDGE : KADAPA

O.S.No. 386/2022

1. G.Sanjeeva Kumar Reddy
2. V.Vijaya Lakshmi ...Plaintiffs

Vs

1. Gavvala Sidda Reddy, S/o Pedda Kasi Reddy, Hindu, Business, D.No.102/104, Bayanapalli Road, Utukuru Village, C.K.Dinne (M), Kadapa Dist. ...ప్రతివాది నెం.1

NOTICE

పైన తెలిపిన వాది మొదటి ప్రతివాది అయిన మీ పైన అలానే ఇతరుల పైన ఆస్థి సంబంధమై గౌరవ కోర్టు నందు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా 30.12.2024 వాయిదా కలదు. సదరు వాయిదా నందు అనగా 30.12.2024 తేదీన ఉదయం 10.30గం॥కు ప్రత్యక్షముగా కానీ లాయరు ద్వారా కానీ కోర్టు ఎదుట హాజరై మీ వాదన తెలుపవలెను. లేనందున మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//

K.BHUVANA EKADASA REDDY
Advocate,
KADAPA. Cell: 9494248849.

మహారాజశ్రీ గౌరవనీయులైన 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, కడప

O.S.No. 774/2024

Canara Bank [erstwhile Syndicate Bank], Represented by its Branch Manager, Erstwhile Udyami Mitra Brahcn, Now merged into NGO Colony Branch, Kadapa. ...వాది

Vs

Topireddy Chandra Sekhar Reddy, S/o. Subba Reddy, Hindu, age 63 Years, Business, resident of D.No. 1/768, Dwaraka Nagar, Kadapa City. ...2వ ప్రతివాది

ప్రతివాదులకు సమన్లు

ఇందుమూలంగా మీకు తెలియజేయడమేమనగా, పై దావా మీ హాజరు కొరకు 02.01.2025వ తేదీన ఉదయం గం.10.30 ని.లకి పై తెలిపిన కోర్ట్ నందు వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా గానీ, మీ తరపున వకీలు ద్వారా గానీ హాజరయ్యి, మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు కేసు తీర్మానించబడును.

//By Order of the Court//

కె. వెంకట సుబ్బయ్య, B.A., B.L.,
వాది తరపు న్యాయవాది,
సెల్: 9704890225.

బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఎస్‌సి కాలనీలో పారిశుధ్య పనులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని సోమాపురం ఎస్‌సి కాలనీలో శుక్రవారం సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గురువారం 'ప్రజాశక్తి'లో 'పైపులైన్ లీకేజీ కలుషితమవుతున్న తాగునీరు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన సర్పంచ్ వెంటనే గ్రామంలో పారిశుధ్య పనులు చేయించారు. దెబ్బతిన్న పైపులైనుకు మరమ్మతులు చేయించి, గ్రామంలో మురుగు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. త్వరలో గ్రామపంచాయతీ నిధులను ఉపయోగించి డ్రయినేజీ కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు ఏర్పాటు చేయిస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణ మనందరి బాధ్యత

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమల నియంత్రణ మన అందరి బాధ్యత అని సబ్ డివిజన్ యూనిట్ వైద్య అధికారి సిద్దయ్య అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని చిన్నరంగాపురంలో ఫ్రైడే-డ్రయిడే కార్యక్రమం సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న చోట్ల అబెట్ పిచికారి చేశారు. ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమములో ఆరోగ్య కార్యకర్త శైలజ, ఆశా కార్యకర్త నాగేశ్వరి పాల్గొన్నారు.

కాలువను పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి - ఖాజీపేట

కెసి చివరి ఆయకట్టు పొలాలకు నీరు అందేలా కాలువను పునరుద్ధరించాలని ఎంపిటిసి డిఎస్ చంద్రభాస్కర్ రెడ్డి, సుంకేసుల నీటి సంఘం అధ్యక్షుడు వెంకట ఈశ్వర్‌రెడ్డి కోరారు. ఆ మేరకు వారు శుక్రవారం కెసి కాలువ ఎఇ సుబ్బరాయుడు, కెసి కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రెడ్యం రవీంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కెసి కెనాల్ ఒకటో నంబర్ కాలువ ఆయకట్టు పరిధిలోని నందిపాడు కాలువ నుంచి సుంకేసుల గ్రామం చివరి అయికట్టు గ్రామమైన శంకరయ్య కొట్టాల వరకు కాలువ లేకపోవడంతో సాగునీరు వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. 50 ఎకరాల వరకు పంట పొలాలు నీట మునుగుతున్నాయని వివరించారు. కాలువ అలైన్మెంట్‌కు సంబంధించి కొలతలు వేసి త్వరితగతిన కాలువను ఏర్పాటు చేయాలని కోరారు. భవిష్యత్తులో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విన్నవించారు. కార్యక్రమంలో పత్తూరు నీటి సంఘం అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు నంద్యాల సుబ్బయ్య యాదవ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ హాకీ అండర్-14 పోటీలకు పులి వెందుల విద్యార్థి ఎంపికయ్యారు. పులి వెందుల సెంటెన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థి ఎం. సంజయ్ ఎంపిక అయ్యారని ప్రధానోపాధ్యాయులు దయా సిస్టర్, స్వప్న సిస్టర్ పేర్కొన్నారు. నవంబర్ నెలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కడప జిల్లా టీంలో ఆడి అత్యధిక గోల్స్ చేసి టీం విజయానికి తోడ్ప డ్డాడని తెలి పారు. సంజయ్ ఎంపిక పట్ల హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఎం.సంజయ్

ఎడిఫై స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలో ప్రభుత్వ విద్య విధానాలకు వ్యతిరేకంగా అడ్మిషన్ చేస్తున్న ఎడిఫై స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహూల్ శుక్రవారం ఎంఇఒ సావిత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికిగానూ ఎడిఫై స్కూల్ ప్రభుత్వ విద్య విధానాల వ్యతిరేకంగా అడ్మిషన్లు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విధానం ప్రకారం జూన్, జూలైలో ప్రారంభించవలసిన అడ్మిషన్లను ముందుగానే చేస్తున్నారని అన్నారు.

కనీస సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రజల కనీస సౌకర్యాలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని ఎంపిడిఒ బి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపిపి మాధవి బాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ గ్రామంలో తాగునీటి సమస్య ఉంటుందో నివేదిక తయారు చేయాలన్నారు. విద్య, వైద్య వాటిపై శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 రవికుమార్, ఎపిఒ రవి, ఎపిఎం ఎస్తేర్ రాణి, మండల ఇంజినీర్ రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శంకర్‌మూర్తి, ఉప మండల అధ్యక్షుడు వేదమూర్తి, ఎంపిటిసిలు మోహన్‌రెడ్డి, గఫూర్, బెల్లం వర్ధన, ఇందుకూరు లీలావతి, సర్పంచ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ బి.రాజశేఖర్‌రెడ్డి

IN THE COURT OF THE HONBLE XI ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURTS, AT :: HYDERABAD

O.P. NO. 1387 OF 2023

Between
Satyanarayana Goud @ Satyanarayana Goud.S ...Petitioner
AND
R.Srilatha & others ...Respondents

NOTICE

To,
R1.R.Srilatha W/o Sunil Kumar Age. Major.Occ. Business R/o. 4/434, Nagarjunapeta, Kadappa, YSR Kadappa Dist.A.P.
R3. Ravana Siddappa S/o Basavaraj
Age. 40 years, Occ. Driver
R/o. Yerabagh Basavakalayan, Yerabagh Bidar.

Please take notice This is to inform you that the above said petitioner has filed case claiming compensation for the injuries sustained by him in motor accident against you and other respondents and the said case is posted on **3-1-2025** at 10:30 AM for your appearance before the above said court. Appear before the court in person or though Advocate without failure other wise orders will be pass.

(BY THE ORDER OF THE COURT)
U.PRAVEEN KUMAR
M.DHANUJA
Advocates
Counsel for the petitioner
O/O Room No.4 A Twin City Complex.
M.J.Road, Abdis, Hyderabad
Cell : 9394834693